

వీడని వర్షం

పోలవరం :మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. గురువారం ఉదయం నుండి వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏజెన్సీలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గుంజవరం కాలువ జలాలు కల్వర్టు నుండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండవాగుల జలాలు కడమ్మ కాలువ నుండి కడమ్మ స్లూయిస్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పట్టిసీమ వద్ద నిర్మించిన కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిస్ నుండి కొండ వాగుల జలాలు గోదావరిలోకి ప్రవేశిస్తున్నాయి. పోలవరం పంచాయతీలో మెయిన్ బజార్, బెస్తవీధి, కొత్తపేట, బాపూజీ కాలనీ, బీసీ కాలనీలు, పట్టిసీమ పంచాయతీలో వీరభద్రపురం, కొత్త పట్టిసీమలో ఏటి గట్టుకు దిగువన ఉన్న నివాసాలు, ఎల్లంకి పేట సమీపంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలు జలమయమయ్యాయి. కొత్త మామిడిగొంది, దేవరగొంది, రామన్నపాలెం, తోట గొంది, కొత్త రామయ్యపేట పునరావాస కాలనీల్లో వర్షపునీరు, కొండవాగుల నీరు కాలనీల్లో చేరింది

గోదా'వర్రీ'...!

- తరుముకొస్తున్న వరద
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరం కాపర్ డ్యామ్ వద్ద 32 మీటర్లకు చేరిన నీటిమట్టం
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 26 గ్రామాలకు రాకపోకలు బంద్
- గొమ్ముగూడెంలో 253 కుటుంబాలు పునరావాస శిబిరాలకు తరలింపు
- భయం గుప్పిట్లో ముంపు మండలాల ప్రజలు
- కలెక్టరేట్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



పోలవరం వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద తరుముకొస్తోంది. రోజురోజుకీ గోదావరి నీటిమట్టం ఉధృతంగా పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31 అడుగులు ఉండగా గురువారం సాయంత్రానికి 43 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 29 మీటర్ల నుంచి 32 మీటర్లకు పెరిగింది. దీన్నిబట్టి వరద ఎంత ఉధృతంగా పెరుగుతుందో స్పష్టమవుతోంది. గతేడాది వరదలతో తీవ్ర ఇబ్బందులు పడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు మళ్లీ వరద భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద ఉధృతి కారణంగా వాగులు, వంకలు పొంగి కాజ్‌వేలు నీట మునుగుతున్నాయి. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కాజ్‌వేపై వరద నీరు చేరి బెస్తగూడెం, గొమ్ముగూడెం, దాచారం, నెమలిపేట వంటి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగు పొంగడంతో కాజ్‌వేపై వరద నీరు చేరి కొయిదా, కట్కూరు, ఎదవల్లి, చిగురుమామిడి, కాచారం, కొత్తూరు వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద ఉధృతి గోదావరికి ఆనుకుని ఉన్న కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను ముందస్తు చర్యల్లో భాగంగా రావికుంట పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరానికి గురువారం సాయంత్రం అధికారులు తరలించారు. గతేడాది జులైలో వచ్చిన వరదలకు గొమ్ముగూడెం ప్రజలు దాదాపు మూడు నెలలపాటు పునరావాస శిబిరాల్లోనే ఉన్నారు. మళ్లీ పట్టుమని తొమ్మిది నెలలు గడవకముందే మళ్లీ పునరావాస శిబిరానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలో గురువారం సైతం వర్షం కురుస్తూనే ఉంది. పైనుండి వరద నీరు గోదావరిలోకి పెద్దఎత్తున చేరుతుండటంతో శుక్రవారం సాయంత్రానికి వరద ఉధృతి మరింత పెరిగే పరిస్థితులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టరేట్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, క్లోరిన్ టాబ్లెట్లు, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, పాముకాటు నివారణకు సంబంధించిన మందులు, గర్భిణుల తరలింపునకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.



సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న కుక్కునూరు మండలం గొమ్ముగూడెం ప్రజలు



కుక్కునూరు మండలంలో గర్భిణులను తరలిస్తున్న అధికారులు

26 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

భయాందోళనల్లో ముంపు మండలాలు

కుక్కునూరు: నాలుగు రోజులుగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద నీరు పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం గోదావరిలో నీరు లేకపోవడంతో ఈ ఏడాది గోదావరి వరద తమ గ్రామాలను ముంచెత్తదని మండల ప్రజలు భావించారు. నాలుగు రోజుల్లోనే గోదావరికి భారీగా వరద రావడంతో మండల ప్రజల్లో తీవ్ర అలజడి నెలకొంది. గతేడాది జులైలో గోదావరి వరదలు మండలాన్ని ముంచెత్తి తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఏడాది గడిచినా నేటికీ ప్రభుత్వం నుండి పూర్తిస్థాయిలో వరద నష్ట పరిహారం ఇవ్వకపోవడం, ఆనాటి భయంకర పరిస్థితులు మరువక ముందే మళ్లీ గోదావరి వరద మండలాన్ని చుట్టుముడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలోని కుక్కునూరు-దాచారం గ్రామాల మధ్య గుండేటి వాగుపై గల కాజ్‌వేను గురువారం వరద ముంచెత్తింది. దీంతో వాగు అవతల వైపు ఉన్న దాచారం, బెస్తగూడెం, గొమ్ముగూడెం, రామచంద్రాపురం, మర్రిగూడెం, నెమలిపేట అరవపల్లి, రామన్నగూడెం, లచ్చిగూడెం, ఊటబోరు, గుండుగూడెం, గుండంబోరు, రావుకుంట, బుడుగు వంటి 14 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొమ్ముగూడెం గ్రామ సమీపంలోకి వరద నీరు చేరుతుండటంతో ముందుగానే స్థానిక తహశీల్దార్ ప్రమద్వర, సిఐ సత్యనారాయణ తమ సిబ్బందితో చేరుకుని గ్రామంలోని 253 కుటుంబాలను ఖాళీ చేయించి రావికుంట పునరావాస కాలనీకి తరలిస్తున్నారు.

వేలేరుపాడు: గోదావరి వరద ఉధృతికి గురువారం మండలంలోని బోళ్లపల్లి-యడవల్లి మధ్య ఎద్దువాగు వంతెన పైకి వరదనీరు చేరడంతో కొయిదా, కట్కూరు, ఎడవల్లి, కొత్తూరు, చిగురుమామిడి, సిద్ధారం, కాసారం వంటి 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వేలేరుపాడు మండలంలోని రుద్రమకోట గ్రామాన్ని జెసి లావణ్యవేణి సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు అప్రమత్తంగాఉండాలని సూచించారు. ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, వారికి అవసరమైన రేషన్, ఇతర నిత్యావసర సరుకులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆమె వెంట జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, వేలేరుపాడు తహశీల్దార్ తదితరులు ఉన్నారు.

పోలవరం ప్రాజెక్టు నుండి 4,49,352 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం అనూహ్యరీతిలో పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు అదనంగా వస్తున్న 4,49,352 క్యూసెక్కుల నీటిని జల వనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. పోలవరంలో బుధవారం సాయంత్రానికి 17.897 మీటర్లుగా ఉన్న నీటిమట్టం గురువారం ఉదయానికి 21.277 మీటర్లకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.300 మీటర్లు, స్పిల్‌వే దిగువన 22.600 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 31.900 మీటర్ల నీటిమట్టం, దిగువ కాపర్ డ్యామ్ వద్ద 21.970 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వరద ఉధృతి పెరగడంతో అధికారులు స్పిల్‌వే రేడియల్ గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి ఉంచారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వాసితులకు కష్టాలు

గతేడాది వరదలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అతలాకుతలమయ్యాయి. కాపర్ డ్యామ్ నిర్మాణంతో వేగంగా వరద నీరు గ్రామాల్లోకి చేరుతోంది. అయినప్పటికీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఏడాది కాలంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో మళ్లీ వరద తరుముకొస్తుండటంతో జనం భయం భయంగా కాలం గడుపుతున్నారు. 2022 అక్టోబర్‌కు 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పరిహారం అందించి తరలిస్తామని సిఎం ఇచ్చిన హామీ సైతం బుట్టదాఖలైంది. నిర్వాసితుల ఇబ్బందులకు ప్రభుత్వమే కారణం. ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం నిర్వాసితులను వెంటాడుతోంది.

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు

ఏలూరు కలెక్టరేట్: 18002331877
జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం: 9553220254
కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం: 7013128597, 9848590546
వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయం: 6309254781

లంకలకు పడవ ప్రయాణాలు నిషేధం

ఆచంట:వశిష్ట గోదావరికి వరద నీరు పోటెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరి వరద గురువారం సాయంత్రానికి మరో రెండు అడుగుల మేర పెరిగింది. దీంతో లంక గ్రామాలకు ముందస్తు జాగ్రత్త చర్యగా పడవ ప్రయాణాలు నిషేధించారు. కరుగోరుమిల్లి పుష్కర ఘాట్ పూర్తిగా నీట మునిగింది. లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు నిషేధించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులైతే వర్ణనాతీతం. పెదమల్లం గ్రామానికి చెందిన సుమారు 200కుపైగా పశువులు ఉన్నాయి. వీటి పోషణకు రైతులు రోజు ఉదయం, సాయంత్రం వెళ్లి పాలు తీసుకొస్తుంటారు. గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే పశువులను ఏటిగట్టుకు చేరుస్తారు. అప్పటి వరకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇప్పటి నుంచే పడవ ప్రయాణాలపై నిషేధం విధించడంతో ఏం చేయాలో పాలుపోక తల్లడిల్లుతున్నారు. గోదావరి నీటిమట్టం మరో పది అడుగులు పెరిగినా ఎటువంటి ఇబ్బందీ లేదని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.



ఏలూరులో దీక్షను ప్రారంభిస్తున్న డిఎన్‌విడి.ప్రసాద్

మున్సిపల్ మహిళా కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం



జంగారెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మున్సిపల్ అప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ మహిళా కార్మికులు(అప్కాస్) నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ దీక్షాదారులకు మెడలో పూలదండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ 2019 ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ కార్మికుల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడారు. శిబిరాన్ని సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.నాగసూరిబాబు, జె.గోపి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ నాయకురాలు కె.విజయలక్ష్మి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకురాలు జె.స్వాతి, నవ సమాజ పార్టీ అధ్యక్షులు ఎం.మహంకాళీ, జ్యూట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.కోటేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ దీక్షల్లో మహిళా కార్మికులు వందలాది మంది పాల్గొన్నారు. మేకల పాప, మరియమ్మ, బండి భవాని, వెంకటలక్ష్మి, కోన మధుమతి, నక్కా భాగ్యలక్ష్మి, తేగల సత్యవతి, ఒ.కాంతమ్మ, వి.దుర్గ, బి.దుర్గ, ఆర్లి రాజమ్మ, రంగమ్మ, కత్తి విజయకుమారి, నరమామిడి నాగమణి, కోటమ్మ, జీవనమ్మ, తదితరులు ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు.

జంగారెడ్డిగూడెం:మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు వద్ద యూనియన్ పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు అధ్యక్షతన గురువారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ముందుగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభానీ రెడ్ రిబ్బన్లు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సిబ్బందికి రిస్క్ హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ సిబ్బందికి పనిముట్లు, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే పలు రూపాల్లో ప్రభుత్వానికి వినతులు అందించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రెండు రోజులు రిలే నిరాహార దీక్షల అనంతరం 27న మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల 7వ తేదీన కలెక్టరేట్ ముట్టడిస్తామని, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ, సిఐటియు సీనియర్ నాయకులు చల్లారి మాణిక్యాలరావు, సంఘ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, వేల్పుల రాజు, జి.వెంకటేష్, గోయమ్మ, తుంగ మంగ, మంగమ్మ, ఎడ్లపల్లి సత్యవతి, ముప్పిడి నాగమణి, కొత్తపల్లి తులసి, మేరీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ఆందోళన



బుట్టాయగూడెంలో ఆందోళన చేస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతి కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. సిఎం జగన్ పాదయాత్ర సమయంలో విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటి పెద్దిరాజు, పటాన్‌వలీబాష, షేక్ ముంతాజ్, మహమ్మద్ దాదాసాహేబ్, షేక్ బాజీ బాష, రామకృష్ణ, వెంకటేష్, కన్నయ్య పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎల రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సిఐటియు నాయకులు జి.రాజు , ఎన్ఆర్ హనుమాన్లు దీక్షా శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల యూనియన్ నాయకులు శ్రీను, ఖాన్, మనోహరం, రంగమ్మ పాల్గొన్నారు.

యుసిసిని వ్యతిరేకించాలి

జంగారెడ్డిగూడెం:ప్రజల మధ్య విభజన తెచ్చే మోడీ, అమిత్‌షా యూనిఫామ్ సివిల్ కోడు(యుసిసి)ను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ధర్మన్న మెమోరియల్ హాలులో న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ అధ్యక్షతన యూనిఫాం సివిల్ కోడ్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధానవక్తగా పాల్గొన్న పి.ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ రచన సందర్భంగా ఆదేశిక సూత్రాల్లో చేర్చిన యూనిఫామ్ సివిల్ కోడ్ అంశాన్ని నేడు ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ శక్తులు రాజకీయంగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. దేశంలో అనేక మతాలు, తెగలు, జాతులు పాటించే సాంప్రదాయాలు వేర్వేరుగా ఉన్నాయనీ, వాటిని ఏకతాటిపైకి తెచ్చేందుకు భవిష్యత్తులో అటువైపు ప్రయాణం సాగించాలని అంబేద్కర్ రాజ్యాంగ రచన డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మెన్‌గా ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచారని ఆయన వివరించారు. ఆర్థిక అసమానతలు పోగొట్టాలని, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధించాలని, నిర్బంధ విద్య అందరికీ అందేలా చూడాలనీ, అంటరానితనం రూపుమాపాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఇలా అనేక అంశాలు ఆదేశిక సూత్రాల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని పట్టించుకోకుండా కేవలం యూనిఫారమ్ సివిల్ కోడ్ మాత్రమే నేడు బిజెపి ప్రభుత్వం తెరమీదకు తేవడంలోనే కుట్ర దాగి ఉందని ఆయన విమర్శించారు. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత ఈ నాలుగు అంశాలు ఒక్కో సాంప్రదాయంలో ఒక్కోరకంగా ఉన్నాయని, వాటిని ఒకే చట్టం పరిధిలోకి బలవంతంగా తేవడం సరైంది కాదన్నారు. ప్రగతిశీల శక్తులు కోరిన విధంగా అంబేద్కర్ ఆశించినట్లుగా అందరికీ సమానమైన పౌరస్మృతి రావాల్సిన అవసరం ఉందనీ, అందుకు అన్ని సామాజిక తరగతులతో సంప్రదింపుల ద్వారా జరగాలే గానీ బలవంతంగా, దౌర్జన్య పూర్వకంగా కాదని ఆయన వివరించారు.

విద్య ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

- విద్య ప్రతి విద్యార్థి జన్మహక్కుగా ఉండాలి
- ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ముగింపు సభలో జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య ప్రయివేటీకరణ విధానాలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కాంక్షిస్తూ విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఈ నెల 11న నరసాపురంలో ప్రారంభించిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర గురువారం జిల్లా కేంద్రం భీమవరంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వాసు అధ్యక్షతన స్థానిక లాంచీలరేవు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి నితీష్ నారాయణ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి విద్యార్థికీ జన్మహక్కుగా ఉండాలన్నారు. అయితే దేశంలో అటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తున్నాయన్నారు. క్యూబా లాంటి దేశాలను సందర్శించినప్పుడు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అక్కడి ప్రభుత్వాలు ప్రజలకు ఉచిత విద్యను అందిస్తున్నాయన్నారు. విద్యను ప్రోత్సహించని ప్రభుత్వం సమాజ వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పెద్ద పెద్ద అంబేద్కర్ విగ్రహాలు పెడుతున్నారుగాని ఆయన కోరుకున్న సమానత్వం కోసం ఏ ప్రభుత్వాలూ పని చేయడం లేదని విమర్శించారు. ఆశయాల సాధన చేయని ప్రభుత్వాలకు విగ్రహాలు పెట్టే హక్కు లేదని మండిపడ్డారు. రోజు కూలీ, ఆటో డ్రైవర్, వ్యవసాయదారుడు, ప్రతి సామాన్యుడు పిల్లలకు కూడా ఉన్నత విద్య అందించాలని, దీనికోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. నిర్బంధం పెట్టినా, జైళ్లకు పంపినా అందరికీ ఉచిత విద్య సాధించేవరకు ఎస్ఎఫ్ఐ ఉద్యమం ఆగదన్నారు. దేశంలో నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం వచ్చేవరకు విద్యార్థులందరూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.77ను తీసుకొచ్చి పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్యను దూరం చేసిందన్నారు. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి నిర్వహించి భర్తీ చేపడతామని చెప్పిన జగన్ ఇప్పుడు ఆ హామీని మరిచారని విమర్శించారు. పాఠశాలలు పెట్టాల్సిన ప్రభుత్వం జిఒ నెం.117 ద్వారా పాఠశాలలను మూసివేస్తుందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు రోజుకు రూ.52 కేటాయిస్తే ఎలాగని, అదే సొమ్ముతో సంబంధిత మంత్రి హోటల్‌లో టిఫిన్ చేయగలరా అని ప్రశ్నించారు. విద్యార్థులకు మెస్ ఛార్జీలు వెంటనే పెంచి నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ సైకిల్ యాత్రలో భాగంగా జిల్లాలో పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, సంక్షేమ హాస్టళ్లలో సుమారు 40 వేల మంది విద్యార్థులను ప్రత్యక్షంగా కలుసుకున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రభుత్వ కాలేజీలను, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అందరికీ దక్కాలని భవిష్యత్తులో పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. దీనిపై త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాన్‌ప్రసాద్, నాయకులు పి.నాగేంద్రకుమార్, కె.ఈశ్వర్, బి.గణేష్, జి.శ్రీనివాసు, కె.శాంతి, కె.నవీన్, ఎన్.పవన్, బి.చిరంజీవి, బి.సింధుసాయి, శేఖర్, రవి, సిద్దు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు, గిరిజనులు

గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలి


వ్యకాస ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ల్యాండ్ సీలింగ్, గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టిఆర్ భూములకు పట్టాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేయాలని పంగిడిగూడెం, నాగులగూడెం, పట్టెన్నపాలెం, కేతవరం గురవాయిగూడెం గ్రామాల దళితులు, గిరిజనులు, పేద ప్రజలు స్థానిక ప్రజా సంఘాల కార్యాల యం నుంచి మసీదు సెంటర్ మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకూ గురు వారం 200 మందితో ర్యాలీ నిర్వహి ంచారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహిం చారు. ఈ ధర్నాకు సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.జీవరత్నం మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం మండలంలో ఉన్న మూడు వేల ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములు గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ భూములకు పట్టాలు మంజూరు చేయకుండా భూస్వాములకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు దళితులకు, గిరిజనులకు, పేద ప్రజలకు నవరత్నాలు అందిస్తానని హామీ ఇచ్చారు కానీ పేద ప్రజలకు ఈ పథకాలు అందించడంలో విఫలమ య్యారని దుయ్యబట్టారు. మండలంలోని పంగిడిగూడెం, కేతవరం, గురవాయి గూడెం, నాగుల గూడెం పట్టెన్నపాలెం గ్రామాల్లో 20 ఏళ్లుగా భూపోరాటాలు నిర్వ హిస్తున్నామని తెలిపారు. పేదలు భూములు పంచమని అడుగుతుంటే భూస్వాములు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై పేదలపై అక్రమ కేసులు బనాయి స్తున్నారని మండిపడ్డారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వై.సీత, జోడి సూర్యచంద్రరావు, ఆనందరావు, కె.సుబ్బారావు, పూసం దర్గ, నాగరాజు, కె.లక్ష్మి, జి.రాంబాబు, జి.సూర్య కిరణ్, ఎ.కాంతమ్మ, బి.సువార్త, జి.నాగమణి, గొల్ల పేరంటాలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

ఏలూరులో తెలుగు మహిళల భారీ ప్రదర్శన



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో సిఎం జగన్ అరాచక పాలన సాగిస్తున్నారని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం నిద్రపోతుందని తెలుగు మహిళలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న దుష్ట పాలన అంతం కావాలని కోరుతూ గురువారం తెలుగుదేశం పార్టీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ బడేటి చంటి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. వసంతమహల్ సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ప్రదర్శన పాతబస్టాండ్ సెంటర్ వరకూ సాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి, నగర అధ్యక్షులు తవ్వా అరుణకుమారి, కార్యదర్శి పిళ్లారిశెట్టి సంధ్య మాట్లాడుతూ కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు మహిళల సంక్షేమానికి పెద్దపేట వేశారని, చంద్రబాబు మహిళల ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించేందుకు బాటలు వేశారని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ రోజు చూసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు, అరాచకాలు జరుగుతున్నా నిందితులకు శిక్ష పడటం లేదని, బాధితులే శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాలన అంతమయ్యేవరకూ పోరాడుతామని హెచ్చరించారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నేతన్న నేస్తం పథకం వర్తింపజేసి రూ.24 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిఎస్ఆర్ ఆదిశేషు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది చేనేత కార్మికులు మగ్గం నేస్తూ జీవిస్తున్నారని, మరో రెండు లక్షల మంది ఉపవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని 98 వేల మంది చేనేత కార్మికులకు నెలకు రూ.2 వేల చొప్పున జీవన భృతి ఇస్తామని ఆనాడు పాలకొల్లు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కానీ రాష్ట్రంలో షెడ్లలో మగ్గం నేస్తున్న 17 వేల మంది చేనేత కార్మికులు షెడ్లను తొలగించారని, దీంతో కార్మికులు తీవ్ర వేదనకు గురయ్యారన్నారు. తక్కువ మజూరికి నేస్తున్న చేనేత కార్మికులకు కూడా నేతన్న నేస్తం పథకం వర్తింపజేసి ఆ కార్మికులను కూడా ఆదుకోవాలని, నెలకు జీవన భృతి రూ.2 వేలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వారి సమస్యలపై పోరాటాలు చేసినా స్పందించలేదని తెలిపారు.

సర్వేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పట్టణాభివృద్ధికి, కార్మిక సంఘాల నిర్మాణానికి ఎంతో కృషి చేసిన మాజీ ఎంఎల్‌ఎ, సిపిఐ నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను, ఆదర్శాలను కార్మిక సంఘాల కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎమ్‌హెచ్‌ఎ సెంటర్లో ఎఐటియుసి అనుబంధ ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం ఆధ్వర్యంలో అత్తులూరి సర్వేశ్వరరావు 41 వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొగాకు పని వారల సంఘం అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. అత్తులూరి సర్వేశ్వరరావు స్మారక స్థూపానికి ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అత్తులూరి సర్వేశ్వరరావు ఏలూరు పట్టణ కౌన్సిలర్‌గా, ఎంఎల్‌ఎగా పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. పొగాకు పని వారల సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, ఏలూరు పట్టణ పొగాకు పని వారల సంఘం నాయకులు గొళ్ల నాగేశ్వరరావు, పుప్పాల శ్రీనివాసు, చింతపల్లి కూర్మారావు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఆశావహులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ టికెట్ కోసం ఆశావహులు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కలిశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎ టికెట్ ఆశించే వారిని చంద్రబాబు నాయుడు వద్దకు రప్పించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, బొమ్మాజి అనిల్, రోషన్ కుమార్‌లు చంద్రబాబునాయుడుని కలిసి చర్చించారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ టికెట్ ఆశిస్తున్న ఈ ముగ్గురిలో ఎవరికి అవకాశం దక్కుతుందో అధిష్ఠానం ప్రకటించే వరకు వేచి చూడాల్సిందే అని స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - కైకలూరు

అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని తామరకొల్లులో రూ.20 లక్షల గడప గడపకు నిధులతో మంజూరైనా నూతన సిసి రోడ్లను శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్, సర్పంచి, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రి ఔషధ దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని ప్రయివేట్ ఆసుపత్రి ఔషధ దుకాణాలలో ఔషధ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం పట్టణంలోని వడ్డమూడి ఆసుపత్రి, సాయిసూర్య, త్రినేత్ర ఆసుపత్రులతో పాటు మరో రెండు ఔషధ దుకాణాలలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో చిన్న చిన్న లోపాలను గుర్తించామని స్థానిక డ్రగ్ ఇన్స్‌పెక్టర్ జాహ్నవి తెలిపారు. ఔషధ దుకాణాలలో అర్హత కలిగిన ఫార్మసిస్టు లేకపోవడం, రికార్డులలో లోపాలను గుర్తించామన్నారు. ఈ తనిఖీలలో తణుకు డ్రగ్ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, ఏలూరు డ్రగ్ ఇన్స్‌పెక్టర్ బాలు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'మహాశక్తి చైతన్య' ప్రచారం

పోలవరం: టిడిపి జాతీయ అధ్యక్షులు విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోలో మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలు మహాశక్తి చైతన్య రథం ద్వారా గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించటం జరుగుతుందని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక పాలనా విధానాలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేయటం, స్వయం ఉపాధి లక్ష్యంగా టిడిపి అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేయటంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు కృష్ణ పాల్గొన్నారు

ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బూత్, క్లస్టర్, యూనిట్ ఇంఛార్జిలు ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని ఐటిడిపి ప్రోగ్రామ్స్ ఇంఛార్జి కొండపల్లి రవి తెలిపారు. రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు చింతలపూడి మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, లింగపాలెం మండల అధ్యక్షులు గరిమెళ్ల చలపతిరావు అధ్యక్షతన చింతలపూడిలోని షాదీఖానాలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటర్ వెరిఫికేషన్, జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని, మన టిడిపి యాప్ గురించి సోషల్ మీడియా ద్వారా పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలి అనే అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవ, టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, టౌన్ ఉపాధ్యక్షుడు మన్నం సత్తిబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కైకలూరు ఎస్ఇబి సిఐ రాంబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడాలి రామాలయం దగ్గరలో సారా విక్రయిస్తున్న గుర్రపు నాగరాజును తన స్కూటీతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి లీటరు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాగరాజును కోర్టుకు హాజరు పరచనున్నట్లు సిఐ రాంబాబు తెలిపారు. గుర్రపు నాగరాజు ముదినేపల్లిలోని పోలీస్‌స్టేషన్ బజారులో నివాసం ఉంటూ, వడాలిలో నివాసం ఉంటున్న తన తల్లి ద్వారా సారాను విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రూ.19 లక్షల విలువైన అపరాలు సీజ్

ప్రజాశక్తి - భీమడోలు

విజిలెన్స్ అధికారులు భీమడోలులో గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా రామచంద్ర ఎంటర్‌ప్రైజెస్‌లో అక్రమంగా నిల్వచేసిన సుమారు రూ.19 లక్షల విలువ గల 21.90 టన్నుల అపరాలను పట్టుకున్నారు. సరుకును సీజ్ చేశారు. విజిలెన్స్ సిఐ విల్సన్ తెలిపిన వివరాల మేరకు భీమడోలు రామచంద్ర ఎంటర్‌ప్రైజెస్ యజమాని కె.రామచంద్రరావు నిల్వ ఉంచిన అపరాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై 6-ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో పాల్గొన్న భీమడోలు సిఎస్‌డిటి-ఎ.మాధవరావు మాట్లాడుతూ సీజ్ చేసిన అపరాల బాధ్యతను భీమడోలు జంక్షన్‌లోని ఎస్‌విఎస్ స్టోర్‌కు అప్పగించినట్లు తెలిపారు. దాడులలో విజిలెన్స్ సిఐతో పాటు విజిలెన్స్ ఎఐ సురేష్ పాల్గొన్నారు.

22న హేలాపురి కళాశాలలో జాబ్‌మేళా

ఏలూరు టౌన్: దెందులూరు మండలం వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22 ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హేలాపురి కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, హేలాపురి కళాశాల వైస్ ప్రెసిడెంట్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు ఇంటర్వ్యూలు నిర్వహించుటకు 60కి పైగా మల్టీ నేషనల్ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేళాలో మూడు వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు సమాచారం. ఏలూరు పరిసర ప్రాంత యువకులకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇతర వివరాల కోసం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ వారి నెంబర్స్ 99899 14587, 94592 56666, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. అరసవెల్లి. ఒఆర్‌జి వెబ్‌సైట్ నందు సంప్రదించాలని తెలియజేశారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు తహశీల్దార్ బి.సుమతి ఎఇఆర్‌ఒ వారి అధ్యక్షతన ఓటర్ల జాబితా సర్వే, సవరణలు, ఆధార్ అనుసంధానం జరుగు ప్రక్రియపై అధికార పార్టీ, వివిధ రాజకీయ పార్టీల కన్వీనర్లు, అధ్యక్షులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి, ఎంపిపిల సంఘాల అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, వెంకటరత్నం, నునకాని రాంబాబు, జల్లేపల్లి జితేంద్ర, గ్రంధి బాలకృష్ణ హాజరయ్యారు.

చింతలపూడి: జులై 21 నుంచి ఆగస్టు 21 వరకూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన చేపట్టనున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఆర్‌డిఎ ఏలూరు, తహశీల్దార్ తెలిపారు. గురువారం స్థానిక చింతలపూడి తహశీల్దార్ కార్యాలయం సమావేశ మందిరంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న వారికి ఓటుహక్కు కల్పించేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు స్వీకరించడం, ఫారం-7 ద్వారా తొలగింపుకు, ఫారం-8 ద్వారా మార్పుల కొరకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అధిక దిగుబడులకు సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

నాణ్యమైన, అత్యధిక దిగుబడుల సాధనకు రైతులు వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి కోరారు. భీమడోలు కేంద్రంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతుల పొలంబడి క్షేత్రం వద్ద గురువారం పొలంబడిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమడోలు సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ రైతులకు కలుపు యాజమాన్యం, వరిసాగులో మెలకువల గురించి వివరించారన్నారు. ఏలూరుకు చెందిన రైతు శిక్షణాకేంద్రం సహాయ సంచాలకులు శ్రీదేవి మాట్లాడుతూ సాగులో ఎరువుల ఖర్చు తగ్గించుకునేందుకు జీవామృతాన్ని వాడుకోవాలని సూచించారు. దీనివల్ల సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి వ్యవసాయ క్షేత్రంలో నేల గుల్లగా మారుతుందన్నారు. భూసారం పెంపుకు అవసరమైన సహాయ సహకారాలు అందుతాయన్నారు. అనంతరం జీవామృతం తయారీ, దాని వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఖర్చు రహిత సహజ వ్యవసాయం విభాగం సిబ్బంది, భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌పి వి.ఉషారాణి, వ్యవసాయ శాఖ గ్రామస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

చిన్నారి అనుమానాస్పద మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన చిన్నారి

ప్రజాశక్తి - భీమడోలు

సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చిన్నారి మృతిచెందిన ఘటన అర్జావారిగూడెంలో చోటుచేసుకుంది. భీమడోలు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెం ఆవాస ప్రాంతానికి చెందిన అంగులూరి వినోద్ కుమార్ కుమార్తె నాలుగు సంవత్సరాల వయసు గల చిన్నారిని చికిత్స కోసం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. అక్కడ వైద్యులు వివిధ పరీక్షలను నిర్వహించి వ్యాధి నిర్ధారణ కోసం సామాజిక ఆరోగ్య కేంద్రంలో అబ్‌జర్వేషన్‌లో ఉంచి చికిత్స కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఏడు గంటల సమయంలో చిన్నారి మృతి చెందింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న బాలిక బంధువులు చిన్నారి మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమేనని, చికిత్సకు సకాలంలో స్పందించలేదని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న భీమడోలు సిఐ, ఎస్ఐ వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు కృషి చేశారు. చిన్నారి మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం ఏలూరు తరలించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ చిన్నారిని కాపాడేందుకు తాము చేసిన కృషిలో లోపాలు లేవని తెలిపారు.

భీమడోలు పంచాయతీ సందర్శన

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు సాధనకు జాతీయస్థాయిలో నామినేట్ అయిన భీమడోలు గ్రామపంచాయతీని ఆ శాఖకు చెందిన థర్డ్ పార్టీ విభాగం గురువారం సందర్శించిందని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ విభాగం తరుపున తనిఖీ అధికారిగా హిస్పోసిస్ హాజరు కాగా, జిల్లా యంత్రాంగం తరపున జిల్లా పంచాయతీ అధికారితో పాటు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా సమన్వయకర్త శిరీష పాల్గొన్నారు. వీరికి భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ముత్తయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, డిఎల్‌పిఒ కెపి చంద్రశేఖర్ సహకరించారు. ఈ సందర్భంగా మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుధ్య పరిరక్షణ, మరుగుదొడ్ల నిర్వహణ, నిర్మాణాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి వారు సహకరిస్తున్న తీరు దీని నిర్వహణకు గ్రామపంచాయతీ చేపట్టిన చర్యలు, ఇతర విభాగాల పనితీరును వారికి కేటాయించిన అంశాల వారీగా పరిశీలించారు. భీమడోలు నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో సదరు బృందం విద్యార్థులతో మమేకమయ్యారు. వారితో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ విభాగంలోని అంశాల వారీగా విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జడ్‌పిటిసి తుమ్మగుంట భవాని, గ్రామ సర్పంచి పి.సునీత, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోదావరి వరద ఉధృతిపై ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో గురువారం మధ్యాహ్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ బి.సుమతి అధ్యక్షతన గోదావరి ఉధృతిపై ఆల్ డిపార్ట్‌మెంట్ మండల అధికారులతో ఫ్లేడ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతి మాట్లాడుతూ సదరు సమావేశంలో ముందస్తు చర్యలుగా మండల అధికారులు, సిబ్బందితో మండల హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయంలో ఫ్లేడ్ కంట్రోల్ రూమ్ గురువారం నుంచి ఏర్పాటు చేసి మూడు షిఫ్ట్‌లలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, సిఐ కె.విజయబాబు, పోలవరం ఎస్ఐ ఎస్ఎస్ పవన్ కుమార్, ఆల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, గ్రామరెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరద పరిస్థితిపై విద్యుత్ శాఖ సర్కిల్ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్

ఏలూరు: జిల్లాలో గోదావరి వరద ఉధృతిపై ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ సూపెరింటెండింగ్ ఇంజనీర్ పి.సల్మాన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో తమ సంస్థ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసామన్నారు. ఎటువంటి విపత్తు పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించామన్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు గాను ఏలూరు ఆర్ఆర్ పేటలోని విద్యుత్ భావం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను 9440902926 ఫోన్ నెంబర్‌తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను గాని, విద్యుత్ స్తంభాలను గాను తాకవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో వరద పరిస్థితిపై అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్

ఏలూరు : గోదావరి నదికి వరద ఉధతి పెరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. వరద పరిస్థితి, ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగంను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గోదావరి నదికి వరద పెరుగుతున్న దృష్ట్యా వరద ప్రభావిత ప్రాంతాలలో ఎటువంటి ఆస్థి, ప్రాణ నష్టాలు జరగకుండా నివారించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ముందుగా వరద కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలపై సంబంధిత మండలాల అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. వరద ముంపు ప్రాంతాలలో ఏర్పాటుచేయనున్న పునరావాస క్యాంపులలో అవసరమైన క్యాంపుల వద్ద తాగునీటి హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేయాలని డ్వామా పిడిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా 5 లక్షల వరకు వాటర్ ప్యాకెట్‌లను సిద్ధం చేసి, 3 లక్షల ప్యాకెట్లు వేలేరుపాడు మండలానికి, 2 లక్షల ప్యాకెట్లు కుక్కునూరు మండలానికి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని, 50 వేల క్లోరిన్ టాబ్లెట్స్ సిద్ధంగా ఉంచాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. వరద సహాయ పునరావాస కేంద్రాల వద్ద 24 గంటలపాటు సిబ్బంది పనిచేసేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలని, మెడికల్ క్యాంపులలో 21 రోజులకు సరిపడా మందులు నిల్వ ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

దరఖాస్తుదారులకు ఊరట 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి - కైకలూరు

రికార్డు స్థాయిలో తామరకొల్లు గ్రామ సచివాలయం పరిధిలో 1,539 పత్రాలను ధరఖాస్తుదారులకు అందజేయటం అభినందనీయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండలం తామరకొల్లు గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలసి పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం దరఖాస్తు దారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, సర్పంచి భట్రాజు శివాజీ, ఎంఆర్ఒ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

భీమడోలు: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింతగా దగ్గర చేసేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జడ్‌పిటిసి తుమ్మగుంట భవాని, మండల పరిషత్ అధ్యక్షుడు కనుమాల రామయ్య కోరారు. పూళ్ల గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి సుజాతప్రసాద్ అధ్యక్షతన గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్‌పిటిసి, ఎంపిపిలతో పాటు భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సచివాలయ పరిధిలోని 730 మంది దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి, పంచాయతీ కార్యదర్శి సూర్య పాల్గొన్నారు.

చింతలపూడి: పరిపాలన వ్యవస్థను ప్రజలకు సంచివాలయం రూపంలో అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. రాఘవపురం, చింతలపూడి పట్టణం సుప్రింపేటలో జగనన్న సురక్షను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఏదైనా అవసరం అయితే జిల్లా కార్యాలయాలు, మండల కార్యలయాలు వద్దకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు గ్రామంలో ఉన్న సంచివాలయంలో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవపురం సర్పంచి కోండ్రు వజ్రకిషోర్ పాల్గొన్నారు.

నరసాపురం: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎంపిపి దారబోయిన లక్ష్మి అన్నారు. మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రంవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి దారబోయిన లక్ష్మి లబ్ధిదారులకు సర్టిఫికేట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్షను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు, ఉమ్మడి తేజ, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

ముసునూరు : ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికీ చేరవేయడానికి వాలంటీర్లు వుండటం అభినందనీయమని ముసునూరు గ్రామ సర్పంచి కోండేటి విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ముసునూరు-1 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, ఎంపిడిఒ జి.రాణీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు తులిమెల్లి కృష్ణకుమారి, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

ముదినేపల్లి: జగనన్న సురక్ష నిరుపేదలకు వరం లాంటిదని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎన్ఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అత్యంత అవసరమైన సేవలను నేరుగా అందించేందుకు సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న 900పైచిలుకు మందికి వివిధ రకాల ధృవీకరణ ప్రతాలను ఎంఎల్ఎ డిఎన్ఆర్, ఎంఎల్‌సి జయమంగళ వెంకరటరమణ అందజేశారు. గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.